సూర్య
www.suryaa.com

# ప్రజ్ఞ

suryaapragnamagazine@gmail.com

బుధవారం 30 ఏప్రిల్ 2025

పేజీలు 8




సివిల్స్ ఫలితాలు


















## ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు



ప్రాచీన భారతదేశ చరిత్ర-2

ప్రజ్ఞ సంచిక కోసం

క్యూఆర్ కోడ్, స్కాన్ చేయండి




పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి

APPSC,TGPSC JL/DL/Group 2 Exams Special

# ప్రాచీన భారతదేశ చరిత్ర-2

## మానవుడు మొట్టమొదటిగా పండించిన పంట ఏది...?



(గత సంచిక తరువాయి.....)

**27. మధ్యరాతియుగంలో మానవుడి జీవనం ఎలాంటిది?**
1. ఒంటరి జీవనం 2. గుంపుల జీవనం
3. సామాజిక జీవనం 4. వలస జీవనం

**28. వలసల జీవితం ప్రధానంగా ఎలాంటి యుగపు కాలంనాటి ప్రధాన లక్షణం?**
1. పాతరాతియుగం 2. మధ్యరాతియుగం
3. నవీన రాతియుగం 4. ఇవేవీ కావు

**29. మానవుడు ఆహారాన్వేషణ దశ నుండి ఆహారోత్పత్తి దశ మధ్య రాతియుగం అయితే, ఆహార నిల్వదశ ఏది?**
1. నవీన రాతియుగం 2. రాగియుగం
3. కంచుయుగం 4. పైవన్నీ

**30. మానవుడు నిప్పును కనుగొన్న కాలం ఏది?**
1. పాత రాతియుగం
2. మధ్యరాతియుగం 3. నవీన రాతియుగం
4. మధ్యపాత రాతియుగం

**31. కుమ్మరిచక్రం, రాగిలోహం వాడకం, మనిషిని పాతిపెట్టే ఆచారం, కోతకోయడానికి కొడవలిని ఉపయోగించడం, వ్యవసాయం చేయడం, స్థిర జీవనం గడపడం, మిగులు ఉత్పత్తిని తరలించడానికి రవాణాకు అంకురార్పణ చేయడం ఇలాంటివి- ఏ కాలం నాటి లక్షణాలు?**
1. మధ్యరాతియుగం
2. పాత రాతియుగం 3. నవీన రాతియుగం
4. ఇవేవీ కావు.

**32. మానవుడు మొట్టమొదటిగా పండించిన పంట ఏది?**
1. గోధుమ 2. వరి
3. మినుములు 4. పెసలు

**33. మానవుడు మొట్టమొదటగా గోధుమ, అనంతరము బార్లీ పంటలనే పండించటానికి కారణం ఏది?**
1. మానవుడు నివసించిన ప్రాంతంలోని అడవి గడ్డి దుబ్బలలో ఇవి ఎక్కువగా ఉండటం వల్ల
2. ఇవి మంచి పోషకాలు కావడం
3. ఎక్కువ కాలం నిల్వ ఉండగలవు కాబట్టి
4. పైవన్నీ

**34. మానవుడు లోహాలను ఉపయోగించడం ఆరంభించిన కాలం సుమారుగా?**
1. క్రీ.పూ. 3500 2. క్రీ.పూ. 2000
3. క్రీ.పూ. 6000 4. క్రీ.పూ. 8000

**35. ప్రపంచ వ్యాప్తంగా నదీలోయ నాగరికతలు ఆరంభమయిన కాలం ఏది?**
1. 4000 బిసి 2. 5000 బిసి
3. 2000 బిసి 4. 6000 బిసి

**36. "ప్రీ హిస్టరీ" అనే పదాన్ని తొలిగా ఉపయోగించిన డేనియల్ విల్సన్ దృష్టిలో ఇది నిజం?**
1. శిలాయుగం ఒకటే ఉంది. అనంతరం రాగియుగం ఆరంభమయింది.
2. ప్రాచీన-నవీన శిలాయుగాలు మాత్రమే ఉన్నాయి.
3. ప్రాచీన-మధ్య-నవీన శిలాయుగాలు ఉన్నాయి.
4. ప్రాచీన శిలాయుగం కాగానే ఇనుపయుగం ఆరంభమయింది.

**37. ప్రాచీన శిలాయుగానికి పాలయోలిథిక్ ఏజ్ అని, నవీన శిలాయుగానికి నియోలిథిక్ ఏజ్ అని పేర్లు పెట్టినది ఎవరు?**
1. జాన్ చైల్డ్ 2. గార్డెన్ చైల్డ్
3. మర్టిమన్ వీలర్ 4. జాన్ ల్యూబెక్

**38. ప్రాచీన-నవీన శిలాయుగాల మధ్యన "మధ్యశిలాయుగం" ఉందని చెప్పినది?**
1. రాబర్ట్ బ్రూస్‌ఫుట్ 2. హెన్రీ
3. పాట్రిక్ 4. మోర్గాన్

**39. ప్రాక్ చరిత్ర కాలాన్ని శిలాయుగం, తామ్రశిలాయుగం, ఇనుప యుగం అని మూడు తరగతులుగా విభజించినది ఎవరు?**
1. క్రిస్టియన్ జర్గున్‌సన్ జఫర్సన్ థాంప్సన్
2. రాబర్ట్ బ్రూస్ పూట్
3. డెటెర్రా-పీటర్‌సన్
4. వీరెవరూ కాదు

**40. కర్ణాటకలోని మస్కీ బ్రహ్మగిరి, హళ్ళూర్, టెక్కలికోట, సంగనకల్లు. ఈ ప్రాంతాలు ఏ కాలంనాటి పనిముట్లకు ప్రసిద్ధి?**
1. పాతరాతియుగం 2. మధ్యరాతియుగం
3. నవీన రాతియుగం 4. రాగియుగం

**41. ఈ క్రింది వానిలో ప్రాక్ చరిత్రలో మానవుడు మచ్చిక చేసుకోని జంతువు ఏది?**
1. ఆవు 2. గొర్రె
3. మేక 4. గుర్రం

**42. రాగులు, ఉలవలు పండించిన ప్రాంతాలు ఏవి?**
1. తమిళనాడులోని పయ్యంపల్లి
2. తమిళనాడులోని తిరుమయ్యం
3. తమిళనాడులోని మందగపట్టు
4. తమిళనాడులోని మామండూరు

**43. రాతియుగాలకు సంబంధించి ఈ వ్యాఖ్యానం నిజం?**
1. పాతరాతియుగం యావత్తూ పూర్తి అయిన అనంతరం మధ్యరాతియుగం ఆరంభమవుతుంది.
2. మధ్య రాతియుగం యావత్తూ పూర్తయిన అనంతరం నవీన రాతియుగం ఆరంభ మయింది.
3. రాతియుగాల్లో ఒకదశ పూర్తిగా అంతమైన మరోదశ ఆరంభం కాలేదు. ఒక దశలోని చివరికాలపు లక్షణాలు మలి దశలోనూ కొంతకాలం వరకూ కొనసాగాయి.
4. పైవి మూడు నిజం కాదు.

**44. మానవుడు మొట్టమొదటిగా తయారుచేసిన యాంత్రిక అంశం ఏది?**
1. కుండ 2. చక్రం
3. బాణం 4. మొన

**45. ప్రపంచ దిమ్మరిగా తిరుగుతున్న మానవుడికి నవీన రాతియుగపు కాలానికి స్థిరజీవనం లభించింది కాగా ఇలాంటి స్థిర జీవనానికి కారణం ఏది?**
1. పూర్తిస్థాయి నదుల ఒడ్డున నివసించడం
2. జంతువులను మచ్చిక చేయడం
3. పూర్తిస్థాయి వ్యవసాయం చేయడం
4. పైవన్నీ

**46. క్రమేపీ మానవుడిలో మతాచారాలు ఏ దశ అనంతరం ఆరంభమయ్యాయి?**
1. చక్రం కనుగొనడంతో
2. కుండల తయారీ అనంతరం
3. వ్యవసాయం అనంతరం
4. ఇవేవీ కావు

**47. రాతి-రాగి-కంచు కాలాన్ని ఎలా పిలుస్తారు?**
1. చాల్కోలిథిక్ పిరియడ్ 2. నాగరికతలు
3. మధ్యరాతియుగపు
4. నవీన రాతియుగం

**48. తొలుత బరువైన రాళ్ళతో, కొయ్యలతో, ఎముకలతో ఆయుధాలు, తరువాత తేలికైన పదునైన ఆయుధాలు, తరువాత రాగి, ఇత్తడి, ఇనుముతో ఆయుధాలు ఈ మూడు కాలాలు వరుసగా ఏవి?**
1. మధ్యరాతియుగం, పాతరాతియుగం, నవీన రాతియుగం
2. నవీన రాతియుగం, మధ్యరాతియుగం, పాతరాతియుగం
3. పాత రాతియుగం, మధ్యరాతియుగం, నవీన రాతియుగం
4. ఇవేవీ కావు.

**49. "నేను-నాది" అనే ఆస్తిభావన ముఖ్యంగా ప్రైవేటు ఆస్తి భావన ఆరంభమయింది?**
1. నవీన రాతియుగపు తొలిదశలో
2. మధ్యరాతియుగపు మధ్యదశలో
3. నవీన రాతియుగపు చివరి దశలో
4. మధ్య రాతియుగపు మలిదశలో

**50. ప్రీ హిస్టరీ కాలంలో తరచుగా మనకు కనపడే పదం "మెన్‌హిర్లు" కాగా ఇవేమిటి?**
1. సమాధులు 2. పంట భూములు
3. నదీ లోయలు 4. రాతి పరిశ్రమలు

**51. తమిళనాడులోని "పల్లవరం" ప్రాధాన్యం ఏది?**
1. తొలి మానవుడి అస్థిపంజరాలు లభించాయి.
2. తొలి మానవుడి రాతి గొడ్డలి లభించింది.
3. తొలి మానవుడి గోడలపై చిత్రకళ ఉంది.
4. తొలి మానవుడి వ్యవసాయ ఆనవాళ్ళు లభించాయి.

**52. "లాంగానాజ్" ఈ కాలం నాటి పనిముట్లకు ప్రసిద్ధి?**
1. పాత రాతియుగం
2. మధ్యపాతరాతియుగం
3. తొలి పాతరాతియుగం
4. మధ్యరాతియుగం

**53. అఘులియన్ సంస్కృతిని ఏ కాలానికి వర్తింపచేయగలం?**
1. పాత రాతియుగం
2. మలి పాతరాతియుగం
3. తొలి పాతరాతియుగం
4. మధ్యరాతియుగం

**54. అష్యూల్ అనగా ఏమిటి?**
1. ఫ్రాన్స్ లోని సోమ్‌నదీ లోయ పేరు
2. ఆదిమానవుడికున్న మరో పేరు
3. ఆదిమానవుడి వాడిన రాతి గొడ్డలి పేరు
4. ఇవేవీ కావు

**55. అష్యూల్ లోయలో లభించిన ఆదిమానవుడి ఆనవాళ్ళకి సంబంధించి రాతితో తయారుచేసిన చేతి గొడ్డలి ప్రధానమయినది. దీని విషయంలో నిజం అయినదేది?**
1. ఇక్కడ లభించిన రాతి గొడ్డలి దీర్ఘచతురస్రంగా తయారయినది.
2. ఇక్కడ లభించిన రాతిగొడ్డలి అత్యంత నాజూకుగా ఉన్నది.
3. ఇక్కడ లభించిన గొడ్డలి మొరటుగా ఉంది.
4. 1&2

**56. అబివిల్లి సంస్కృతి ఫ్రాన్స్ దేశానికి చెందిన అబివిల్లిలోయలో పరిఢవిల్లింది. కాగా అబివిల్లి సంస్కృతి కూడా పాత రాతియుగానికి చెందినదే. కాగా అబివిల్లి సంస్కృతికి సంబంధించిన గొడ్డలి విషయంలో ఇది నిజం?**
1. ఈ గొడ్డలి రాతితో తయారయినది.
2. ఈ గొడ్డలి నాజూకుగా ఉంది.
3. ఈ గొడ్డలి మొరటుగా ఉంది.
4. ఈ గొడ్డలి నల్లరాతితో తయారయినది.

**జవాబులు :**
27)2, 28)1, 29)1, 30)2, 31)3, 32)1, 33)4, 34)1, 35)1, 36)2, 37)4, 38)4, 39)1, 40)3, 41)4, 42)1, 43)3, 44)4, 45)4, 46)3, 47)2, 48)3, 49)3, 50)1, 51)2, 52)4, 53)4, 54)1. 55)4, 56)3



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238




# సివిల్స్ ఫలితాలు:సత్తాచాటిన తెలుగు విద్యార్థులు

**దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) సివిల్ సర్వీసెస్ పరీక్ష 2024 తుది ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సంవత్సరం మొత్తం 1,009 మంది అభ్యర్థులు వివిధ సర్వీసులకు ఎంపికయ్యారు. వారిలో, జనరల్ కేటగిరీకి చెందిన 335మంది, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన 109 మంది (EWS), ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన 318 మంది (OBC), షెడ్యూల్డ్ కులాలకు చెందిన 160మంది మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన 87 మంది ఉన్నారు. వీరిలో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు.**

సివిల్స్‌కు ఎంపికైన అభ్యర్థులను కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS), ఇండియన్ పోలీస్ సర్వీస్ (IPS) మరియు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (IFS) సహా 25 కి పైగా సర్వీసులలో నియమిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 57 మంది అభ్యర్థులు ర్యాంకులు సాధించారు. టాప్-100 జాబితాలో ఏడుగురు తెలుగువారు ఉన్నారు.

**ఎంపిక ప్రక్రియ**

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ వచ్చింది. జూన్ 16, 2024న జరిగిన ప్రిలిమినరీ పరీక్షతో ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఫలితాలు జూలై 1న ప్రకటించబడ్డాయి. మెయిన్ పరీక్షలు సెప్టెంబర్ 20 నుండి 29 వరకు నిర్వహించబడ్డాయి, వాటి ఫలితాలు డిసెంబర్‌లో ప్రకటించబడ్డాయి. జనవరి 7 మరియు ఏప్రిల్ 17, 2025 మధ్య న్యూఢిల్లీలో రెండు సెషన్‌లలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియ చివరి దశ ఇంటర్వ్యూ కు మొత్తం 2,845 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఫలితాలు ప్రకటించారు. 1,009 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులలో 241 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని తదుపరి ధృవీకరణ వరకు తాత్కాలికంగా ఉంచింది.

**ప్రిలిమినరీ పరీక్షకు 10 లక్షలమంది దరఖాస్తు**

ప్రిలిమినరీ పరీక్షకు 9,92,599 మంది దరఖాస్తు చేసుకోగా, 5,83,213 మంది మాత్రమే పరీక్ష రాశారు. వీరిలో మెయిన్స్ రాత పరీక్షకు 14,627 మంది అర్హత సాధించగా, ఇంటర్వ్యూలకు 2,845మంది ఎంపికయ్యారు. జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 నడుమ ఇంటర్వ్యూలు నిర్వహించి.. వారిలో1,009 మంది అభ్యర్థులను సివిల్స్‌కు ఎంపిక చేసినట్టు యూపీఎస్సీ ప్రకటించింది.

**టాప్-10 ర్యాంక్ హోల్డర్లు**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు చెందిన శక్తి దూబె తన తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా నిలవగా.. హరియాణాలో జన్మించి గుజరాత్‌లో పెరిగిన హర్షిత గోయల్ రెండోస్థానంలో నిలిచారు. యూపీఎస్సీ జాతీయ టాప్-10 ర్యాంక్ హోల్డర్లను ప్రకటించింది.

**UPSC CSE 2024 టాప్ 10 జాబితా..**



శక్తి దూబే
హర్షిత గోయెల్
డోంగ్రే అర్చిత్ పరాగ్
షా మార్గి చిరాగ్
ఆకాష్ గార్గ్
కొమ్మల్ పునియా
ఆయుషి బన్సాల్
రాజ్ కృష్ణ ఝా
ఆదిత్య విక్రమ్ అగర్వాల్
మాయాంక్ త్రిపాఠి

శక్తి దూబె యూనివర్సిటీ ఆఫ్ అలహాబాద్ నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం బయో కెమిస్ట్రీలో పీజీ చేసేందుకు బెనారస్ హిందూ యూనివర్సిటీకి వెళ్లారు. ఈమె అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయో కెమిస్ట్రీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆమె పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని విజయం సాధించారు.

సెకండ్ ర్యాంక్ సాధించిన హర్షిత గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకామ్ గ్రాడ్యుయేట్. ఆమె కూడా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌ను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని సివిల్స్‌లో రెండో ర్యాంకు సాధించారు. ఇక మూడో ర్యాంకర్ డోంగ్రే అర్చిత్ పరాగ్ వెల్లూరులోని విట్ నుంచి ఇంజినీరింగ్ చేశారు. ఫిలాసఫీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని మూడో ర్యాంకుతో సత్తా చాటారు.

**విజేతల విద్యాభ్యాసం- ఆప్షన్స్ ఎంపిక..**

సివిల్స్‌లో సత్తా చాటిన ర్యాంకర్లను పరిశీలిస్తే..



తెలుగు రాష్ట్రాల సివిల్స్ ర్యాంకర్లు...
సాయి శివాని , బన్నా వెంకటేశ్

విజయం సాధించిన వాళ్లలో ఎక్కువ మంది దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, వీఐటీ, జేఎన్‌యూ, ఢిల్లీ యూనివర్సిటీ, అలహాబాద్ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించారు. వీళ్లు ఇంజినీరింగ్, హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్, మెడికల్ సైన్స్, ఆర్కిటెక్చర్ వంటి కోర్సుల్లో గ్రాడ్యుయేషన్ చేయడం విశేషం.

సివిల్స్ మెయిన్స్ రాత పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థులు మెజారిటీ.. ఆంత్రోపాలజీ, కామర్స్ అండ్ అకౌంటెన్సీ, జాగ్రఫీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తమిళ భాషా సాహిత్యంతో సహా పలు సబ్జెక్టులను ఆప్షన్స్‌గా ఎంచుకున్నారు.

**సివిల్స్‌లో మెరిసిన తెలుగు విద్యార్థులు ..**

తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 42,560 మంది ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాగా.. వారిలో 600 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వారిలో దాదాపు 100మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. 40 మందికిపైగా తుది జాబితాలో చోటు సాధించారు.

యూపీఎస్సీ సివిల్స్ సాధించిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులలో.. ఇ.సాయి శివాని 11వ ర్యాంకు, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్.శ్రీకాంత్ రెడ్డి 151, నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంకులు సాధించారు.

**ఇంటర్ ఫెయిల్ కానీ సివిల్స్‌లో 988వ ర్యాంకు**

తిరుపతి జిల్లా నారాయణవనం మండలం గోవిందప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన పామూరి సురేష్ సివిల్స్‌లో 988వ ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు సాధారణ విద్యార్థి అయిన సురేష్.. ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యారు. నంద్యాలలో డిప్లొమా కోర్సులో చేశారు. ఆ సమయంలో స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం పుస్తకాలు చదివి ఎంతో స్ఫూర్తి పొందారు. చదువుతోనే జీవితంలో మార్పు వస్తుందని గట్టిగా నమ్మిన సురేష్.. సివిల్స్‌కు ఎంపికైతే పేదల కష్టాలు తీర్చవచ్చని గ్రహించారు.

డిప్లొమా తర్వాత ఈసెట్ రాసి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించారు. కర్నూలులో ఇంజినీరింగ్ పూర్తి చేశాక.. 2011లో జెన్‌కోలో ఏఈగా ఉద్యోగంలో చేరారు. 2017లో తొలిసారి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయగా ప్రిలిమ్స్ పరీక్ష కూడా గట్టెక్కలేక పోయారు. మరింత కష్టపడి చదివిన ఆయన రెండో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. కానీ తుది జాబితాలో మాత్రం చోటు దక్కలేదు. తిరిగి 2020లో సన్నద్ధమవుతుండగా కొవిడ్ మహమ్మారి బారిన పడటంతో వినికిడి సమస్య తలెత్తింది. ఇలా తరచూ వైఫల్యాలు వెంటాడినా మనో ధైర్యం మాత్రం కోల్పోలేదు.

సివిల్స్ సన్నద్ధతకు ఇబ్బందిగా ఉందని 2020లో ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు. 2024లో ఏడో ప్రయత్నంలో 988వ ర్యాంకు సాధించారు. వరుస వైఫల్యాలు ఎదురైనా వెరవక ముందుకు అడుగులేస్తే విజయం ఏనాటికైనా దక్కుతుందనడానికి సురేష్ గాథే ఓ ఉదాహరణ.

# పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి

జమ్మూలో అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ లోయలో విహారయాత్రకు వచ్చిన పర్యాటకులే లక్ష్యంగా పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలు నిర్వహించే లష్కరే తొయిబా అనుబంధ విభాగం ది రెసిస్టెంట్ ఫ్రంట్ దాడికి పాల్పడింది. ఈ ఈ ఘటనలో 27 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇటీవల కాలంలో జమ్మూ కశ్మీర్‌లో జరిగిన అతి పెద్ద ఉగ్రదాడి ఇదే. ఈ ఘటనతో కశ్మీర్‌లోనే కాక దేశవ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటన నేపథ్యంలో ఉగ్రవాదులు వ్యూహాత్మకంగా ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

**హిందువులపైనే దాడి**

ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి కేవలం హిందువులే లక్ష్యంగా దాడి చేయడాన్ని దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఖండించాయి. కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాము మద్దతుగా ఉంటామని స్పష్టం చేశాయి.

పహల్గాంలోని ఉగ్రవాదుల కాల్పుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లో ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసే మనీశ్ రంజన్.. విశాఖపట్నానికి చెందిన చంద్రమౌళి చనిపోయారు.

ఉగ్రదాడి నేపథ్యంలో సౌదీ అరేబియా పర్యటనను అర్ధాంతరంగా ముగించుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలోనే ఉన్నతాధికారులతో దీనిపై మోదీ చర్చించారు.



తరువాత ప్రధాని అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కమిటీ అత్యవసర సమావేశమై ఉగ్రదాడిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని, పాకిస్థాన్ పర్యాటకులు భారత్ నుంచి వెళ్లిపోవాలని తేల్చేసింది. ప్రత్యేక వీసాదారులు కూడా మరో 48 గంటల్లో భారత్‌ను వీడాలని ఆదేశాలు జారీ చేసింది.

పహల్గామ్ దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులకు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అమాయకులైన ప్రజలను ఉగ్రవాదులు అతికిరాతకంగా చంపేశారని అన్నారు. ఈ దుర్మార్గమైన దాడులకు తెగబడ్డవారు ఎక్కడున్నా తీసుకొచ్చి మట్టిలో కలిపేసే సమయం వచ్చిందని అన్నారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని విధంగా వారిని శిక్షిస్తామని హెచ్చరించారు. దాడులకు పాల్పడినవారు భారీ మూల్యం చెల్లించుకుంటారని మోదీ వార్నింగ్ ఇచ్చారు.

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత్ ఐదు కీలక నిర్ణయాలు తీసుకుంది.


- సింధూ జల ఒప్పందాన్ని రద్దు చేశారు
- దౌత్య కార్యకలాపాల సిబ్బందిని 55 నుంచి 30కి తగ్గించారు.
- పాకిస్థాన్ సైనిక దౌత్యవేత్తలను పర్సనా నాన్ గ్రాటాగా ప్రకటించారు
- పాకిస్థాన్‌కు సార్క్ వీసా రద్దు చేసింది.
- వాఘా అట్టారి సరిహద్దు మూసివేసింది.

కశ్మీర్‌లో స్థానికులు ఒకప్పటిలా లేరు. గతకొన్నాళ్ల నుంచి మార్పు మొదలైంది. పహల్గామ్ దాడితో కశ్మీరుల గుండె రగిలిపోతోంది. ప్రశాంతగా ఉంటే కశ్మీర్‌పై ఉగ్రవాదులు తుపాకీ ఎక్కుపెట్టడంతో పర్యాటకం కుదేలై తమ ఉపాధి పోతోందని తెలుసుకున్నారు. దీంతో ఉగ్రవాదుల గురించి సమాచారాన్ని రహస్యంగా భారత్‌కు అందజేస్తున్నారు. స్థానికుల సపోర్ట్‌తో సైనికులు ఇంటింటా జల్లెడ పడుతున్నారు . ఎన్‌కౌంటర్లతోనూ విరుచుకు పడుతున్నారు. బందిపొరా ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబా టాప్ కమాండర్ అల్తాఫ్‌ను హతమార్చారు. ఉగ్రవాదుల ఆవాసాలను కూల్చిపడేస్తున్నారు. కశ్మీర్, పంజాబ్ బోర్డర్‌లలో బలగాలు మోహరించాయి.

పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలతో భారత్- పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాక్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించి విచ్చలవిడిగా కాల్పులకు తెగబడుతుండటం, ప్రతిగా కాల్పులతో భారత దళాలు దీటుగా సమాధానం ఇస్తుండటంతో.. ఎప్పుడేం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. సరిహద్దులకు సమీపంలోని గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా బంకర్లలోకి వెళ్లి తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు ఉగ్రవాదుల జాడ కోసం భద్రతా బలగాలు వివిధ ప్రాంతాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవారులపై విజయసాధనలో దూసుకెళుతున్నాయి.



# ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు..





తెలుగు రాష్ట్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయి ఫలితాలు వెలువడటంతో తరువాత ఏం చదవాలనే దానిపై విద్యార్థులు దృష్టి సారించారు. ఇంటర్మీడియట్ తర్వాత అనేక విద్యావకాశాలు ఉన్నప్పటికీ నీట్, ఎంసెట్‌లో రాంక్ ఆధారంగా మెడిసిన్/ఇంజనీరింగ్‌లను ఎక్కువ మంది ఎంపిక చేసుకుంటున్నారు. మిగిలిన వారు సాధారణ డిగ్రీ కోర్సుల వైపే మొగ్గు చూపిస్తున్నారు. సమాచార సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల ఫలితంగా అనేక నూతన కోర్సులు ఆవిర్భవించాయి. ఈ కోర్సులు చేయడం వల్ల తక్కువ కాలంలో అధిక వేతనం అందించే ఉద్యోగంలో స్థిరపడవచ్చు. ముందుగా ఇంటర్మీడియట్ తర్వాత గల విద్యావకాశాలను తెలుసుకుందాం.

తెలుగు రాష్ట్రాలలో ఇంటర్‌లో విద్యార్థుల తొలి ఎంపిక సైన్స్ గ్రూప్. మరలా దీనిలో తొలి రెండు ప్రాధాన్యాలు, ఎంపీసీ, బైపీసీ గ్రూపులే. ఎంపీసీ గ్రూప్ తో ఇంటర్మీడియట్ చదివే ప్రతి విద్యార్థి జీవిత ధ్యేయం ఐఐటీ/ఎంసెట్‌లో ర్యాంక్ సాధించటం. బైపీసీ గ్రూప్ తో ఇంటర్మీడియట్ చదివే ప్రతి విద్యార్థి జీవితధ్యేయం నీట్‌లో ర్యాంక్ సాధించటం.

**ఇంజనీరింగ్**

ఎంపిసి గ్రూపు తీసుకున్న విద్యార్థులు ఇంజనీరింగ్ వైపు మొగ్గు చూపడం సహజం. ఇంజనీరింగ్‌కు ఎంసెట్‌తో పాటు ఐఐటీ, బిట్‌శాట్ లాంటి ఇతర జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలు అనేకం ఉన్నాయి. డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల స్థాపనతో ఇంజనీరింగ్‌లో నాణ్యతా ప్రమాణాలతో పాటు, భారీ సంఖ్యలో సీట్లు పెరిగాయి. ఫలితంగా ఏవరేజ్, బిలో ఏవరేజ్ విద్యార్థులకు కూడా సులభంగా సీటు లభిస్తోంది. ఐనా ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించడం ద్వారా పేరున్న కాలేజీల్లో మంచి బ్రాంచీలలో సీటు సాధించడం కోసం విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ నుంచే ఎం సెట్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. ఇంజనీరింగ్ కోర్సులలో చేరేందుకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీరింగ్‌లో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ వంటి 80కి పైగా బ్రాంచీలలో కోర్సులున్నాయి. ఈ కోర్సుల కాలవ్యవధి నాలుగు సంవత్సరాలు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కు మాత్రం 5 సంవత్సరాలు కాలవ్యవధి ఉంటుంది.

తెలంగాణలో ఎంసెట్‌ను 2025 మే 2-4 తేదీలలో నిర్వహిస్తున్నారు. వివరాలకు https://eamcet.tsche.ac.in వెబ్‌సైట్ చూడండి. ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్‌ను ఏపీఈఏపీ సెట్ (Engineering Agriculture and Pharacy Common Entrance Test-APEAPCET) అనే పేరుతో 2025 మే 21-27 తేదీలలో నిర్వహిస్తున్నారు. వివరాలకు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడండి.

**జెఈఈ- మెయిన్స్**

జెఈఈ పరీక్ష మెయిన్స్, అడ్వాన్స్‌డ్ అనే రెండు స్థాయిలలో నిర్వహిస్తారు. ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే జెఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

దీనిలో రెండు పేపర్లుంటాయి. ఇంజినీరింగ్ ప్రవేశాలు కోరుకునేవారు పేపర్-1, ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సులలో ప్రవేశం పొందగోరు అభ్యర్థులు పేపర్-2/2bకు హాజరుకావాలి.

వివరాలకు https://jeemain.nta.nic.in వెబ్‌సైట్ చూడండి.

**జెఈఈ- అడ్వాన్స్‌డ్**

ఐఐటీలలో బిటెక్, ఇంటిగ్రేటెడ్, బిటెక్ (బిటెక్+ ఎంటెక్) కోర్సులలో ప్రవేశానికి జెఈఈ అడ్వాన్స్‌డ్ లో రాంక్ సాధించాలి. జెఈఈ మెయిన్స్‌లో రాంకు ఆధారంగా రెండున్నర లక్షల మందిని జెఈఈ అడ్వాన్స్‌డ్ రాయటానికి ఎంపిక చేస్తారు. దీనిలో రాంక్ ఆధారంగా ఐఐటీలలో సీటు పొందవచ్చు. జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష 2025 మే 18న నిర్వహిస్తారు. వివరాలకు https://jeeadv.ac.in వెబ్‌సైట్ చూడండి.

**BIT SAT**

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలతోపాటు ఇంజినీర్ కావాలనే ఆశావాహులు బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సంస్థలో ప్రవేశం కొరకు ప్రతి సంవత్సరం బిట్స్ అడ్మిషన్ టెస్టును నిర్వహిస్తున్నారు. మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో ప్రశ్నాపత్రం ఉంటుంది. దీనిలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు గోవా, హైదరాబాద్, పిలానీలలో బిట్స్ కళాశాలలో ప్రవేశం పొందవచ్చు. వివరాలకు www.bitsadmission.com వెబ్‌సైట్ చూడండి.

**డీమ్డ్ యూనివర్సిటీలు...**

డీమ్డ్ యూనివర్శిటీలు ఇటీవల కాలంలో సొంత కరిక్యులమ్ తో నూతన కోర్సులను అందిస్తున్నాయి. ఇవి ప్రవేశాలకు సొంత ఎంట్రన్స్ టెస్టులను నిర్వహిస్తున్నాయి. యూనివర్సిటీలకు అనుబంధంగా గల రీజనింగ్ ఇంజనీరింగ్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్శిటీలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఇంజనీరింగ్‌లో వివిధ రకాల కోర్సులను అందిస్తున్నాయి.(గ్రూపుల వివరాలకు కింది పట్టికను చూడండి)

**మెడికల్**

వైద్యో నారాయణో హరిః అంటే వైద్యుడు దేవునితో సమానం. సమాజం వైద్యునికంతటి గొప్ప స్థానం కల్పించింది. అంతేగాక మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహార పద్ధతుల కారణంగా రోజురోజుకి రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ పరిమిత స్థాయిలోనే వైద్యులు అందుబాటులో ఉన్నారు. పరిమిత సీట్ల వల్ల ఈ కోర్సులో ప్రవేశానికి కాంపిటీషన్ ఎక్కువ. విద్యార్థులు, తల్లిదండ్రులుకూడా మెడిసిన్‌వైపు మక్కువ చూపిస్తున్నారు.

ఈ కోర్సులో ప్రవేశించాలంటే ఇంటర్మీడియట్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (బైపిసి) గ్రూపుతో ఉత్తీర్ణులై జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-యూజీ పరీక్షలో రాంకు తెచ్చు కోవాలి. నిజానికి వైద్య విద్య అంటే కేవలం ఎం.బి.బి.ఎస్. మాత్రమే కాదు డెంటల్, హోమియోపతి, ఆయుర్వేదం, యునాని, న్యాచురోపతి, వెటర్నరీ సైన్స్, ఫిజికల్ మెడిసన్‌అండ్ రీహాబిలిటేషన్ మొదలైన కోర్సులు ఉన్నాయి.

వైద్యవిద్యను అభ్యసించుటకు నీట్-యూజీలో ర్యాంక్ ఆధారంగా వివిధ కళాశాలలో సీట్లు కేటాయిస్తారు. దేశం మొత్తం మీద అందుబాటులో నున్న సుమారు లక్షా ఇరవై వేల (వీటిలో 56వేలు ప్రభుత్వ రంగంలోనివి) సీట్ల కోసం దాదాపు 25 లక్షల మంది పోటీ పడతారు. తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ కాలేజీలలో ప్రభుత్వ రంగంలో 3902 సీట్లు, ప్రైవేటు రంగంలో 4550 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీలలో ప్రభుత్వ రంగంలో 3385 సీట్లు, ప్రైవేటు రంగంలో 3400 మెడికల్ సీట్లు ఉన్నాయి. తాజాసీట్ల వివరాలకు సంబంధిత వెబ్‌సైట్ చూడండి. వీటిలో 15 శాతం సీట్లు జాతీయ కోటాలో, 85 శాతం సీట్లు జాతీయ రాష్ట్ర కోటాలోమెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ ప్రైవేటు హాస్పటల్స్‌లో జూనియర్ డాక్టర్ నుండి కెరీర్ ప్రారంభించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

**ఆయుర్వేద, హోమియోపతి...**

ఎంబిబిఎస్‌లో సీటు సాధించలేకపోయిన అభ్యర్థులు ప్రత్యామ్నాయంగా ఆయుర్వేద, హోమియోపతి వైద్యాలకు ప్రాధాన్యం గల బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ, బ్యాచిలర్ ఆఫ్ హోమియెపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పూర్తి చేయవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**బిడిఎస్ ....**

మెడికల్ కోర్సులలో ఎంబిబియస్ తర్వాత ప్రాచుర్యం పొందిన కోర్సు బిడియస్. ఎంబిబియస్‌కు వర్తించే నియమ నిబంధనలే దీనికీ వర్తిస్తాయి. నీట్-యూజీ పరీక్షలో రాంకు ఆధారంగా బీడీఎస్ లో సీటు లభిస్తుంది. దంత వైద్యులకు ప్రభుత్వ వైద్యశాలలు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యులుగా అవకాశాలున్నాయి. సొంత వైద్యశాలలను స్థాపించుకొని ప్రాక్టీస్ చేసుకోవడానికి కూడా అవకాశాలుఅపారంగా ఉన్నాయి.

**వెటర్నరీ సైన్స్ ...**

మనది వ్యవసాయ ఆధార దేశం. వ్యవసాయానికి పశువులకు అవినాభావ సంబంధం ఉంది. భారతదేశంలోనే మెడిసిన్ తర్వాత ఎంతో డిమాండ్‌గల కోర్సు వెటర్నరీ సైన్స్.

తగిన సంఖ్యలో వెటర్నరీ డాక్టర్లు లభ్యంకాక పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. తిరుపతి, హైదరాబాద్‌లలో వెటర్నరీ కళాశాలలు ఉన్నాయి.



## Engineering Branches

Ane - Aeronautical Engineering
Aei-Applied Electronics& Instrumentation Engineering
Aut - Automobile Engineering
AI- Artificial Intelligence
AIml-Artificial intelligence and Machine learning
ARE-Automation and Robotics Engineering
Bme - Bio-medical Engineering
Bio - Bio-technology
Cbe - Chemical Bio-engineering
Che - Chemical Engineering
Cpe - Chemical Petrol Engineering
Civ - Civil Engineering
Cee - Civil Environmental Engineering
CeR - Ceramic Technology
Cse - Computer Science & Engineering
Css - Computer Science & Systems Engineering
Cs- Cyber security
Ds- Data Science
Eee - Electrical & Electronics Engineering
Ece - Electronics & Communication Engineering
Ecm - Electronics & Computer Engineering
Eie - Electronics & Instrumentation Engineering
Etm - Electronics & Telematics
Ecs - Electronics Conrol Systems Engineering
Fpt - Food Processing Technology
GIO - Geo Informatics
Inf - Information Technology
Ice - Instrumentation & Control Engineering
Ist-Instrumentation Engineering/ Technoloy
ME - Marine Engineering
Mec - Mechanical Engineering
Mmc - Mechanical Marine Engineering
Mct - Mechanical(mechatronics)
Met - Metallurgical Engineering
Mmt - Metallurgy And Material Technology
Min - Mining Engineering
Nva - Naval Architecture
Phm - Pharmacy,
Pe Petrolium Engineering
Ipe - Production / Industrial Production
Re-Robotics Engineering
Tex - Textile Technology


## మెడికల్ , పారా మెడికల్ కోర్సులు

| | |
|---|---|
| MBBS | : Bachelor of Medicine & Bachelor of Surgery |
| BDS | :Bachelor of Dental Surgery |
| BAMS | :Bachelor of Ayurvedic Medicine and Surgery |
| BHMS | :Bachelorof Homoeopathic Medicine and Surgery |
| BNYS | :Bachelor of Naturopathy and Yogic Sciences |
| BUMS | :Bachelor of Unani Medicine and Surgery |
| BPT | :Bachelor of Physiotherapy |
| BSc(MLT): | Bachelor of Sciences(Medical Laboratory Technology) |
| BSc(N) 4Y: | Bachelor of Sciences(Nursing) 4 year course |
| BSc(N) 2Y: | Bachelor of Sciences(Nursing) 2 year course |
| BSc(O) | : Bachelor of Sciences(Optometry) |
| BSLA | :Bachelor in Speech Language Pathology and Audiology |



# ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు..





ఈ వెటర్నరీ కళాశాలలు ఐదు సంవత్సరాల బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండ్రీ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. ఇంటర్మీడియట్‌లో బయాలజీ, ఫిజిక్స్ కాంబినేషన్‌తో అడ్మిషన్ సంవత్సరం అక్టోబర్ నాటికి కనీసం 16 సంవత్సరాలు నిండినవారు పై కోర్సులలో ప్రవేశం పొందవచ్చు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెటర్నరీ హాస్పిటల్స్, జూ, వైల్డ్ లైఫ్ శాంక్చురీ. పౌల్ట్రీ రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

**ఫిజికల్ మెడిసన్ అండ్ రీహాబిలిటేషన్**

ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆడియాలజీ, స్పీచ్ థెరపీ అండ్ హియరింగ్, మానసిక వికలాంగులకు ప్రత్యేక చికిత్సా పద్ధతులు ఫిజికల్ మెడిసన్ అండ్ రీహాబిలిటేషన్‌లో భాగం. దీనిలో డిగ్రీ, డిప్లొమా కోర్సులు కూడా ఉన్నాయి.

**అగ్రికల్చర్ ఇంజనీరింగ్**

ఇంటర్ పాసయిన తర్వాత వ్యవసాయ విద్యలో అనేక కోర్సులు ఉన్నాయి. బియస్సీ అగ్రికల్చర్, బిటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బియస్సీ ఫారెస్ట్రీ, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్, బియస్సీ డైరీ టెక్నాలజీ, బియస్సీ సెరికల్చర్, బియస్సీ హార్టీకల్చర్. బాపట్ల, రాజేంద్రనగర్ (హైదరాబాద్), తిరుపతిలలో అగ్రికల్చర్ కాలేజీలున్నాయి. ఇవి ఇంటర్మీడియట్ పాసయిన విద్యార్థులకు 4 సంవత్సరాల బియస్సీ అగ్రికల్చరల్ సైన్స్ కోర్సును అందిస్తున్నాయి. బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ 4 సంవత్సరాల బిటెక్ ఇంజనీరింగ్ కోర్సును అందిస్తోంది. తిరుపతిలోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ 4 సంవత్సరాల బియస్సీ డైరీ టెక్నాలజీ కోర్సును అందిస్తోంది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం బియస్సీ హార్టీ కల్చర్ కోర్సులను అందిస్తోంది. ఎంసెట్ ర్యాంక్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.

**నర్సింగ్**

ఆధునిక వైద్య సదుపాయాలు విస్తరించి కార్పొరేట్ హాస్పిటల్స్ పెరగడంతో నర్సింగ్‌కు డిమాండ్ పెరిగింది. నర్సింగ్ స్కూల్స్ కూడా విస్తరించాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు మన రాష్ట్రంలో మూడేళ్ల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ కోర్సు, నాలుగేళ్ల బియస్సీ నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లోని నిమ్స్ బియస్సీ నర్సింగ్ కోర్సు నందిస్తోంది. వివరాలకు www.nims. edu.in చూడండి. నర్సింగ్ కోర్సు పూర్తి చేసినవారికి కార్పొరేట్ హాస్పిటల్స్‌తో పాటు గల్ఫ్ దేశాలలో, అమెరికా, యూరోప్ తదితర పాశ్చాత్య దేశాలలోనూ విస్తృత సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్నాయి.


**హోమ్ సైన్స్**

మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ్ సైన్స్‌లో డిగ్రీ చేసినవారికి టీచింగ్, హాస్పిటల్స్, హోటల్స్,



కమ్యూనిటీ డెవలప్‌మెంట్, వెల్‌ఫేర్ ప్రాజక్టులు తదితర రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఎంసెట్‌లో ర్యాంక్ ఆధారంగా వీటిలో ప్రవేశం లభిస్తుంది. మ్యాథ్స్, ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్ కాంబినేషన్లతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్ళు. మొదటి రెండు సంవత్సరాల్లో కామన్ సబ్జక్టులుంటాయి. చివరి రెండేళ్ళలో స్పెషలైజేషన్స్ ఎంచుకోవాలి. ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఫ్యామిలీ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోమ్‌సైన్స్ ఎక్స్‌టెన్షన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, టెక్స్‌టైల్స్ అనే స్పెషలైజేషన్లుంటాయి. కోర్సు పూర్తి చేసిన వెంటనే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బిఎస్సీ హోం సైన్స్ విద్యార్థులు ఆచార్య ఎన్‌జి రంగా, అగ్రికల్చరల్ యూనివర్సిటీ, వెంకటేశ్వర యూనివర్సిటీ, శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీలలో ఎంఎస్సీ అభ్యసించవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు పిహెచ్‌డి పూర్తి చేసి బోధన/పరిశోధర రంగాలవైపు అడుగులు వేయవచ్చు.

**ఫార్మసీ**



అభివృద్ధితో పాటు వాతావరణ పరిస్థితులు, కాలుష్యం తదితర కారణాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అత్యధిక ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. డాక్టర్లు సూచించిన మందులు ఇవ్వడంలోనూ, ప్రసిద్ధ మందుల తయారీ కంపెనీల్లో సంబంధిత ప్రక్రియను పర్యవేక్షించడంలోనూ ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంటర్ బైపిసి/ఎంపిసి విద్యార్థులకు ఫార్మసీలో డిప్లొమా, బ్యాచిలర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సు పూర్తి చేయగానే వీరికి రెడ్డి లాబ్స్, వసుధ ఫార్మశీ, మెడ్ ప్లస్, అపోలో వంటి సంస్థలతోపాటు దేశం లోని అనేక ప్రతిష్టాత్మక సంస్థలలో ఉపాధి అవకాశాలున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెడికల్ షాపులు స్థాపించి సొంత వ్యాపారం నిర్వహించుకోవచ్చు. ఎంఫార్మసీ పూర్తి చేసి పరిశోధన/బోధన రంగాల్లో ప్రవేశించవచ్చు. బైపీసీ విద్యార్థులకు డిఫార్మసీ, ఎంఫార్మసీతోపాటు ప్రాక్టికల్ ఓరియెంటెడ్‌గా రూపుదిద్దుకున్న ఫార్మడీ ఇటీవల ప్రాచుర్యం పొందింది.

**హార్టికల్చర్**

ఇటీవల కాలంలో అత్యంత ప్రాచుర్యం పొందుతున్న కోర్సులలో హార్టికల్చర్ ఒకటి. ఈ రంగం మన దేశ జిడిపిలో అత్యధిక వాటాను కలిగి ఉంది. నిత్య జీవితంలో మనం ఉపయోగిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు ఉద్యానవనాలనుండి సేకరిస్తారు. నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలోనూ, సేంద్రీయ ఎరువులతో అత్యధిక దిగుబడి సాధించడంలోనూ హార్టికల్చరిస్టులు ఉద్యానవన రైతులకు సహకారం అందిస్తారు. ఈ కోర్సులో ప్రవేశించాలంటే బైపిసితో ఇంటర్ ఉత్తీర్ణులు కావాలి. ఈ కోర్సు కాల వ్యవధి నాలుగేళ్ళు. ఎంసెట్ ర్యాంకు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో, నర్సరీలు, ఎరువులు, రసాయనాల తయారీ కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉపాధి లభిస్తుంది.

హార్టికల్చర్‌లో ఎంఎస్సీ, పిహెచ్‌డి అభ్యసించి బోధనా, పరిశోధనా రంగాలవైపు వెళ్ళవచ్చు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ జెఆర్‌ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఫెలోషిప్ సాధించవచ్చు.

**ఇంటిగ్రేటెడ్ కోర్సులు**

ఇటీవల బహుళ ప్రాచుర్యం పొందుతున్న కోర్సులు ఇంటిగ్రేటెడ్ కోర్సులు. ప్రస్తుతం ఇంటర్ తర్వాత విద్యార్థుల అభిరుచి మేరకు డిగ్రీ పూర్తి చేసి ఐసెట్, యూనివర్సిటీ సెట్‌ల ద్వారా పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారు. ఈ విద్యా విధానాన్ని కొనసాగిస్తూనే ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు ప్రవేశపరీక్షల ద్వారా సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్ కోర్సులలో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలు ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఆర్ట్స్, కామర్స్, సైన్స్ కోర్సులలో పీజీ పూర్తి చేసి అధ్యాపకులుగా స్థిరపడవచ్చు. అభిరుచి గల వారు పరిశోధనా రంగాన్ని ఎంచుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్/డిప్లొమో/సర్టిఫికెట్ కోర్సులు , ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (ఐదేళ్లు) , ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (ఐదేళ్లు) ,బిబిఎ ఎల్‌ఎల్‌బీ, బిఎఎల్‌ఎల్‌బీ, బీకాంతో ఏసీడబ్ల్యుఎఐ, బీబీఏ- ఎంబీఏ వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఇటీవల ప్రాచుర్యం పొందుతున్నాయి.

**డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్**

ఇంటర్మీడియట్ తర్వాత గౌరవంతో పాటు మంచి వేతనం కల ఉద్యోగం పొందేందుకు ఉత్తమమైన మార్గం టీచర్ ట్రైనింగ్ కోర్సు చేయడం. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ గలవారు ఇంటర్మీడియట్ తర్వాత డిఎడ్ కోర్సును పూర్తి చేయడం ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడవచ్చు. ప్రభుత్వం డియస్సీ ద్వారా వేల సంఖ్యలో టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. ప్రైవేటు విద్యాసంస్థలు కూడా డిఈడి పూర్తి చేసిన వారికి ఐదంకెల వేతనంతో రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డైట్‌సెట్ పరీక్ష ద్వారా డిఎడ్‌లో చేరవచ్చు.

వివరాలకు http:dietcet.cgg.gov.in , deecet. cdsc.telangana. gov.in వెబ్‌సైట్ చూడండి.

**ఛార్టెడ్ అకౌంటెన్సీ**

ఇంటర్మీడియట్‌లో సిఇసీ, ఎంఇసీ గ్రూప్ అభ్యర్థులు ఛార్టెడ్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ కోర్సులు అభ్యసించడం ద్వారామంచి భవిష్యత్తు పొందవచ్చు. ఆసక్తి గల బైపీసి, ఎంపీసీ గ్రూప్ అభ్యర్థులుకూడా ఈ కోర్సులను ఎంచుకోవచ్చు. ఇటీవలి కాలంలో ఇంటర్మీడియట్‌తోపాటే సిఎ, ఐసీఏఐ (గతంలో ఐసీడబ్ల్యుఏఐ) ఓరియెంటేషన్‌తో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ పూర్తవగానే సీఏ, ఐసిఎఐలలో పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకుంటున్నారు. వీటి గురించి మరింత సమాచారం కోసం www.icai. org, www.icsi.edu వెబ్‌సైట్‌లను సందర్శించండి.

**న్యాయశాస్త్రం**

పురాతన కాలం నుండి న్యాయశాస్త్రానికి మంచి డిమాండ్ ఉంది. మారుతున్న సామాజిక, ఆర్థిక, పరిస్థితుల కనుగుణంగా న్యాయవాద వృత్తి కొత్త రూపు సంతరించుకుంటోంది. దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక పోషించిన జవహలాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయి పటేల్ మొదలైన వారు న్యాయవాద వృత్తి ద్వారా జనసామాన్యంలో పేరు ప్రఖ్యాతులు సాధించిన వారే. ఇంటర్మీడియట్ అర్హతగల అభ్యర్థులు 5 ఏళ్ళ లా కోర్సును అభ్యసించవచ్చు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి లాసెట్ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో లాసెట్ ఎంట్రన్స్ టెస్టులో పొందే ర్యాంకు ఆధారంగా లా కోర్సులలో ప్రవేశం లభిస్తుంది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాలయాల్లో న్యాయవాద విద్యను అభ్యసించాలంటే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ క్లాట్‌లో అర్హత సాధించాలి. నేషనల్ లా యూనివర్సిటీ, ఢిల్లీ నిర్వహించే ఎంట్రన్స్ టెస్టు ద్వారా దేశంలోని ప్రసిద్ధ సంస్థల్లో న్యాయవాద విద్యను అభ్యసించవచ్చు. కోర్సు పూర్తి చేసిన వారు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి బార్‌లో మెంబర్ షిప్ తీసుకోవాలి. తదనంతరం సీనియర్ న్యాయవాది లేదా లా ఫర్మ్‌లలో జూనియర్‌గా చేరి వృత్తిలో మెళకువలు తెలుసుకొని స్వంత ప్రాక్టీసు ప్రారంభించవచ్చు. పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు న్యాయవాదులను లీగల్ అడ్వైజర్‌గా నియమించుకుంటున్నాయి. ప్రభుత్వ రంగంలో జిల్లాకోర్టులు, హైకోర్టులలో ఉద్యోగం సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. ఇటీవల పలు బ్యాంకులు కూడా లాయర్స్‌ను స్పెషలిస్ట్ ఆఫీసర్స్‌గా రిక్రూట్ చేస్తున్నాయి. విదేశీ సంస్థలు న్యాయవాద వృత్తిలో ఔట్‌సోర్సింగ్‌ను ప్రారంభించి తమ చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులకు శిక్షణనిచ్చి మంచి వేతనంతో ఉపాధి కల్పిస్తున్నాయి.

**ఏవియేషన్ ....**

విమానయాన రంగం ఇటీవలి కాలంలో మన దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. స్వల్ప వ్యవధి కోర్సులకు అధిక వేతనాన్ని అందించే రంగాలలో ఏవియేషన్ ప్రధానమైనది. దీనిలో టెక్నికల్, నాన్‌టెక్నికల్ కోర్సులు ఉన్నాయి. టెక్నికల్ ఉద్యోగాలకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లు అర్హులు. నాన్‌టెక్నికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ చదివినవారు అర్హులు. ఎయిర్ హోస్టెస్, క్యాబిన్‌క్రూ, గ్రౌం డ్‌క్రూ వంటి ఉద్యోగాలు ఇందులో ప్రధానమైనవి.

ఈ రంగంలో ఎయిర్ హోస్టెస్, గ్రౌండ్ స్టాఫ్, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్, ఫ్రాంక్లిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎయిర్ హోస్టెస్ ట్రైనింగ్, ఆసియా ఫసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎయిర్ హోస్టెస్ వంటి సంస్థలు ఏడాది వ్యవధి గల డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. ప్రాంతీయభాషలు, ఇంగ్లీష్‌తోపాటు విదేశీ భాషలలోనైపుణ్యం గల వారికి భారీ వేతనాలతో ఉపాధి లభిస్తుంది.





# ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు..





**ఏరోనాటికల్ ఇంజనీరింగ్....**

ఎంసెట్ ఆధారంగా ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. కోర్సులో భాగంగా విమానాలు, హెలికాప్టర్లు, క్షిపణులు, శాటిలైట్ల డిజైనింగ్ వంటి అంశాల్లో శిక్షణనిస్తారు. బిటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఏరోడైనమిక్స్, ప్రొపల్షన్ వంటి స్పెషలైజేషన్లలలో ఎంటెక్ పూర్తి చేయవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ ఏరోనాటికల్ ఇంజినీర్లకు ప్రత్యేకంగా ఏవియేషన్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారికి ఇస్రో, డిఆర్‌డిఓ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతోపాటు ప్రముఖ విమాన తయారీ సంస్థలలో భారీ వేతనంతో ఉపాధి అవకాశాలున్నాయి. మన దేశంలో ఐఐటీలతోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ 70 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులకు ఏరోస్పేస్ ఇంజినీరింగ్ కోర్సును అందిస్తుంది.

**ఆర్కిటెక్చర్....**

నింగి నంటే భవనాలు, ప్రముఖ స్టేడియంలు, హాస్పిటల్స్, పాఠశాల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు ఇలా ఏ భవన సముదాయం గురించి మాట్లాడుకున్నా వాటి డిజైనింగ్‌లో ప్రధాన పాత్ర పోషించేది ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్. ఈ కోర్సుకు నేటి యువతలో మంచి క్రేజ్ ఉంది. ఐదేళ్ళ వ్యవధి గల ఈ కోర్సుకు ఇంటర్ ఎంపిసి విద్యార్థులు అర్హులు. ఈ కోర్సు అభ్యసించాలనే అభ్యర్థులు దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ పరీక్షలో అర్హత సాధించాలి. బిఆర్క్ పూర్తి చేసిన విద్యార్థులు డిజైనింగ్, రీజనల్ ప్లానింగ్, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర స్పెషలైజేషన్లలో ఉన్నత విద్యనభ్యసించవచ్చు.

**జర్నలిజం...**

ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తూ, ప్రజా సమస్యలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రభుత్వం, రాజకీయ పక్షాల దృష్టిలోకి తెస్తూ వాటి పరిష్కారాలకు తోడ్పాటునందిస్తున్న వృత్తిలో జర్నలిజం ప్రధానమైనది. ఈ రంగం మీద అభిరుచి గల అభ్యర్థులు ఇంటర్మీడియట్ అర్హతతో జర్నలిజంలో డిప్లొమా కోర్సులు పూర్తి చేసి ఉపాధి పొందవచ్చు. మాస్ కమ్యూనికేషన్ ఒక సబ్జెక్టుగా అనేక విద్యా సంస్థలు డిగ్రీ స్థాయిలో కోర్సులను అందిస్తున్నాయి. సాధారణ గ్రాడ్యుయేట్లు కూడా బ్యాచిలర్ ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో ఏడాది వ్యవధి గల డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసి మంచి వేతనంతో మీడియాలో రిపోర్టర్, సబ్ ఎడిటర్లుగా కెరీర్ ప్రారంభించవచ్చు. అనుభవం, నాలెడ్జ్ ఆధారంగా సిటీ బ్యూరో, స్టేట్ బ్యూరోల స్థాయి నుండి ఎడిటోరియల్ బోర్డు స్థాయికి ఎదగవచ్చు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఇన్‌పుట్ ఎడిటర్ల, స్క్రోలింగ్ అసిస్టెంట్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా , న్యూస్ రీడర్‌గా ఇలా అనేక విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.సోషల్ మీడియాలో జర్నలిజంలో అనుభవం గల వారికి విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సమాజంలో కూడా మంచి గుర్తింపు ఉంటుంది. అనేక కళాశాలలు, విశ్వవిద్యాలయాలు జర్నలిజం కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నియమించుకుంటున్నాయి. సెక్రటేరియట్ వంటి ప్రభుత్వ విభాగాల్లో జూనియర్, సీనియర్ రిపోర్టర్ల భర్తీ లో వీరికి ప్రాధాన్యముంటుంది. అన్ని ప్రముఖ తెలుగు దిన పత్రికలు, ద హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ఇంగ్లీషు దినపత్రికలు సొంత జర్నలిజం స్కూల్ ద్వారా ఔత్సాహికులైన అభ్యర్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేసిన వారికి శిక్షణనిచ్చి తమ సంస్థల్లోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

**హోటల్ మేనేజ్‌మెంట్...**

గ్లోబలైజేషన్ కారణంగా దేశాల మధ్య అంతరం తగ్గిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో జరుగుతున్న సదస్సులు హాజరవుతున్న డెలిగేట్స్, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అనేక పర్యాటక ప్రదేశాలను వీక్షించడానికి దేశవిదేశాల నుండి పర్యాటకుల తాకిడితో ఈ రంగం బాగా విస్తరించింది. తదనుగుణంగా సుశిక్షితులైన ఉద్యోగ బృంద అవసరం పెరిగింది. ఈ డిమాండ్‌ను తీర్చడం కోసం దేశవ్యాప్తంగా పలు ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు డిప్లొమా, డిగ్రీ స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తున్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదవవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా దీనిలో ప్రవేశం ఉంటుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ,న్యూఢిల్లీ పలు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హోటల్ మేనేజమెంట్, ఆతిధ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్, మేనరిజం, సేల్స్ పట్ల ఆసక్తి గల యువత ఈ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందవచ్చు. ఈ రంగంలో అనుభవం సంపాదించిన ఔత్సాహికులు సొంత బిజినెస్ ప్రారంభించవచ్చు. వివరాలకు www.nchmt.org వెబ్ సైట్‌ను చూడండి.



**టూరిజం ....**

విదేశీ మారక ద్రవ్యాన్ని చేకూరుస్తున్న ప్రధాన రంగాల్లో టూరిజం ఒకటి. మన దేశ భౌగోళిక స్థితులు, అంతర్జాతీయ గుర్తింపు పొందిన చారిత్రక సంపద విదేశీ పర్యటకులను ఆకర్షిస్తున్నాయి. ఐటి రంగంలో ఇండియా మంచి స్థితిలో ఉండటంతో పలు బహుళ జాతి సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ నుండి నిర్వహించడం వల్ల ఆయా సంస్థల ప్రతినిధుల రెగ్యులర్ పర్యటనలు కూడా టూరిజం, హాస్పిటాలిటీ రంగాల అభివృద్ధి ఊపందుకుంటోంది. అందుచేత ఈ రంగంలో శిక్షితులైన గైడ్‌ల అవశ్యకత పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా అనేక సంస్థలు టూరిజం అండ్ హాస్పిటాలిటీలో కోర్సులను నిర్వహిస్తున్నాయి. డిగ్రీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో అలీగర్ యూనివర్సిటీ, బెనారస్ యూనివర్సిటీ వంటి పలు ప్రతిష్టాత్మక సంస్థలు ఎంబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ, అడ్వాన్స్‌డ్ హోటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు ఆతిధేయ రంగంలో ఫ్రంట్ ఆఫీస్/బ్యాక్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌గానూ, టూరిజం గైడ్‌గానూ అనేక రంగాల్లో ఉపాధి పొందవచ్చు.

**లైబ్రరీ సైన్స్**

ఇంటర్మీడియట్ పాసైనవారికి లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీస్ డిపార్ట్‌మెంట్ ఈ కోర్సులను పర్యవేక్షిస్తుంది. శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ – అనంతపూర్ ఇంటర్మీడియట్ పాసైనవారికి ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ గ్రంథాలయాలలో లైబ్రేరియన్ ఉద్యోగానికి అర్హులు. లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ, పీజీ చేస్తే మరిన్ని ఉద్యోగావకాశాలుంటాయి. ఏపీపీఎస్సీ జూనియర్, డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ పోస్టులను పోటీ పరిక్ష ద్వారా భర్తీ చేస్తోంది.

**కంప్యూటర్ కోర్సులు .....**

ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అక్రిడిటేషన్ ఆఫ్ కంప్యూటర్ కోర్సెస్ (డిఓఇఎసిసి) అనే సొసైటీని స్థాపించింది. ఇది దేశంలో కంప్యూటర్ కోర్సుల నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించేందుకు నాలుగు స్థాయిలలో కోర్సులను రూపొం దించింది. అవి A లెవెల్ (ప్రాథమిక స్థాయి) B లెవెల్ (అడ్వాన్స్‌డ్ డిప్లొమా), C లెవెల్ (ఎంసిఎతో సమానమైనది), C లెవెల్ (ఎంటెక్‌తో సమానమైనది). ఈ కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సంస్థల నియామాకలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేగాక పలు ప్రైవేటు సంస్థలు అం దిస్తున్న ఎంఎస్ ఆఫీస్, డెస్క్ టాప్ పబ్లిషింగ్ (పేజ్‌మేకర్, ఫొటోషాప్), కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి షార్ట్ టర్మ్ కోర్సు ల ద్వారా కూడా మీడియా, సాఫ్ట్‌వేర్, కళాశాలల్లో సంస్థలలో గ్రాఫిక్ డిజైనర్,కంప్యూటర్ ఆపరేటర్, హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడవచ్చు. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ విద్యార్హతలను మెరుగుపరచుకొని సొంత సంస్థలు స్థాపించి వ్యాపార రంగంలో కూడా రాణించవచ్చు. మరిన్ని వివరాలకు DOEACC సొసైటీ, ఎలక్ట్రానిక్స్ నికేతన్, రెండవ అంతస్థు, 6ఇఎ కాంప్లెక్స్, న్యూ ఢిల్లీ – 110003 చిరునామాను సంప్రదించండి.

**ఫారిన్ లాంగ్వేజెస్**

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది ప్రపంచం ఒక కుగ్రామంగా మారిన తరుణంలో అనేక దేశాల మధ్య సంబంధాలకు ప్రాధాన్యత పెరిగింది. విద్య, వైద్య, ఆరోగ్యం, శాస్త్రీయ, ఆర్థిక, వాణిజ్య, పర్యాటక రంగాల్లో సంభవిస్తున్న ఆధునిక మార్పులను ప్రపంచ దేశాలు ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. ఇతర దేశాల సమాచారాన్ని తెలుసుకోవాలన్నా, స్వదేశంలో మార్పులను విదేశీయులకు తెలియజేయాలన్నా విదేశీ భాషా పరిజ్ఞానం అవశ్యం. దౌత్యం వంటి విషయాల్లో ప్రాచీన కాలం నుండి ఆదరణ పొందుతున్న విదేశీ భాషలకు డిమాండ్ పెరిగింది. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి స్థాయిల్లో అనేక యూనివర్సిటీలు విదేశీ భాషలను అందిస్తున్నాయి. వీటిలో హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ ఇఫ్లూ ముందువరుసలో ఉంది. ఈ యూనివర్సిటీ అరబిక్, జర్మన్, ఫ్రెంచి, స్పానిష్, ఇంగ్లీష్ వంటి అనేక విదేశీ భాషలను ఆఫర్ చేస్తుంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు దేశ, విదేశాల్లోని దౌత్య కార్యాలయాల్లో కళ్ళు చెదిరే ప్రారంభ వేతనంతో ఉపాధి పొందవచ్చు. ఇతర భాష ప్రచురణలు ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ట్రాన్సలేటర్‌గా ఉపాధి పొందవచ్చు. చారిత్రక ప్రదేశాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తులు విదేశీ పర్యాటకులకు గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఉస్మానియా యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు కూడా విదేశీ భాషలకు చెందిన కోర్సులను అందిస్తున్నాయి. ఇండియన్ ఫారిన్ సర్వీస్ ద్వారా ప్రభుత్వ సర్వీసుల్లో కూడా ప్రవేశించి విదేశీ వ్యవహారాల కార్యదర్శి స్థాయికి ఎదగవచ్చు. బహుళ జాతి సంస్థల్లో ట్రాన్సలేటర్ గా ఉపాధి పొందవచ్చు.

**ఫ్యాషన్ టెక్నాలజీ...**

ఇటీవల కాలంలో యువత ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులపై మక్కువ చూపిస్తున్నారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఇంటర్ విద్యార్థులకు బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులను నిర్వహిస్తోంది. దీనిలో యాక్సెసరీస్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, టెక్స్‌టైల్ డిజైన్ వంటి పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఈ కోర్సులకు సంబంధించి మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల నిఫ్ట్ క్యాంపస్‌ను సంప్రదించండి. లేదా www.nift.ac.in వెబ్‌సైట్‌ను చూడండి.

**ఎన్‌డీఏ,ఎన్‌ఏ...**

యుపీఎస్సీ ఎన్‌డిఎ/ఎన్ఎ, స్పెషల్‌క్లాస్ రైల్వే అప్రెంటీస్ ద్వారా ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఇంజనీరింగ్ విద్య నందించడంతో పాటు ప్రభుత్వ రంగంలో ఉపాధి కల్పిస్తోంది. నేవల్ వింగ్‌లో ఉపాధి కోరుకునే అభ్యర్థులు ఏ గ్రూపుతోనైనా ఇంటర్; ఎన్‌డిఎ, ఎస్‌సిఆర్‌ఎలలో ఉపాధి పొందగోరు అభ్యర్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జక్టులతో ఇంటర్ పూర్తి చేయాలి. ఎన్‌డిఎ, పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కోర్సులను అభ్యసించవచ్చు. త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్ హోదాలో ఉపాధి లభిస్తుంది. ఎస్‌సిఆర్ఎ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు బిట్ మెస్రాలో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసి రైల్వేలో ఉపాది పొందుతారు. ఈ సంస్థలు ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్ కూడా అందిస్తున్నాయి.








# ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు..





### కాల్ సెంటర్ ట్రైనింగ్

ఇటీవలికాలంలో కాల్ సెంటర్, బిపిఓ ట్రైనింగ్ బాగా ప్రాచుర్యం పొందాయి. ఇంటర్మీడియట్ అర్హతతోనే ఐదంకెల వేతనం అందిస్తున్న కెరీర్‌లలో కాల్‌సెంటర్లు ముందు వరుసలో ఉన్నాయి. ఇటీవల పట్టణాల్లో నివసిస్తున్న యువత ఎర్నింగ్ అండ్ లెర్నింగ్ కాన్సెప్ట్‌తో ఒక వైపు ఉద్యోగం చేస్తూనే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. కాల్ సెంటర్ ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌తోపాటు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి పట్టణాల్లో కూడా అనేక శిక్షణ సంస్థలు వెలిశాయి. ఆసక్తిగల యువతీయువకులకు శిక్షణతోపాటు ప్లేస్‌మెంట్స్ చూపిస్తున్నాయి..ఇంటర్మీడియట్ అర్హతతో ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని కలిగి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే కాల్ సెం టర్ ట్రైనింగ్ ద్వారా ప్రారంభంలోనే నెలకు 20వేల రూపాయల వరకు సంపాదించే అవకాశం ఉంది. స్థానిక భాషతోపాటు మరో భాషలో ప్రావీణ్యం గల వారికి కంపెనీలు ఎక్కువ అవకాశాలు ఇస్తున్నాయి.

### టైప్, షార్ట్ హ్యాండ్ కోర్సులు....

నేటి సాంకేతిక యుగంలో ఈ కోర్సులు కనుమరుగవుతున్నప్పటికీ ఈ నైపుణ్యాలు గల అభ్యర్థులకు ఉపాధి అవకాశాలకేమి కొదువ లేదు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకులు; అనేక ప్రభుత్వ రంగ సంస్థలు డిగ్రీతోపాటు టైపింగ్ హయ్యర్ పూర్తి చేసిన జూనియర్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు; స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. మీడియా, లీగల్ ఆఫీసులు వంటి ప్రైవేట్ సంస్థలలో కూడా స్టెనోగ్రాఫర్లను నియమించుకుంటున్నాయి. గ్రాడ్యుయేషన్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం గలవారు పలు ప్రైవేటు సంస్థలలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగాలు మార్కెట్లో విస్తృతంగా ఉన్నాయి. పీజీతోపాటు టైపు, షార్ట్‌హ్యాండ్ కోర్సులను పూర్తి చేసిన వారు ఇంటర్ ఒకేషనల్ కోర్సులలో లెక్చరర్‌గానూ ఉపాధి పొందవచ్చు.

### సాధారణ డిగ్రీ కోర్సులు

సాధారణంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అభ్యర్థులకు అందుబాటులో ఉండే సాంప్రదాయక కోర్సులు బిఏ, బియస్సీ, బికాం. వీటిలో ప్రతి గ్రూప్‌లో అనేక స్పెషలై



జేషన్స్ ఉన్నాయి. సివిల్ సర్వీసెస్, ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, గ్రూప్ -1, గ్రూప్ - 2 వంటి పోటీ పరీక్షలు రాసి ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడదామనుకునేవారు ప్రభుత్వ పాలనా శాస్త్రం, చరిత్ర, సోషియాలజీ, ఎకనామిక్స్ వంటి గ్రూప్‌లలో బిఏ చదవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఛార్టెడ్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కోర్సుల పట్ల ఆసక్తి గల వారికి బికాం, బికాం కంప్యూటర్ సైన్స్ ఉపయోగకరంగా ఉంటాయి. బియస్సీ కోర్సు చేసినవారు ఐసెట్ వంటి పోటీ పరీక్షల ద్వారా ఎంబిఏ, ఎంసిఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేయడం ద్వారా మంచి ఉద్యోగం సాధించ వచ్చు. పరిశోధనా రంగంపట్ల ఆసక్తి గలవారు డిగ్రీ తర్వాత సంబంధితరంగంలో పరిశోధన చేయవచ్చు.

బిఎస్సీ ఎంపిసి విభాగంలో మాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ వంటి సబ్జెక్టులున్నాయి. బైపీసీ విభాగంలో బిఎస్సీలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ వంటి సాంప్రదాయ కోర్సులతో పాటు మైక్రోబయాలజీ, జెనిటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమికల్ టెక్నాలజీ, డైరీ టెక్నాలజీ, సుగర్ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ వంటి ఆధునిక కోర్సులు కూడా ఉన్నాయి.

**ఇవేగాక ఈ కింది ప్రత్యేక కోర్సులు కూడా ఉన్నాయి.**




★ బయోఇన్‌ఫర్మాటిక్స్
★ హోమ్ సైన్స్
★ న్యూట్రిషన్ మరియు డైటిక్స్
★ డైరీ టెక్నాలజీ అండ్ పౌల్ట్రీ ఫార్మింగ్
★ ఆప్టోమెట్రీ
★ ఫారెస్ట్రీ అండ్ వైల్డ్‌లైఫ్
★ ఫుడ్ టెక్నాలజీ
★ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్
★ ఫారెన్సిక్ సైన్స్
★ హార్టికల్చర్
★ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ థెరపీ
★ అగ్రికల్చర్ , ఇతర సంబంధిత రంగాలు
★ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్
★ బ్యాచ్‌లర్ ఆఫ్ మెంటల్ రిటార్డేషన్

ఇటీవల బహుళ ప్రాచుర్యం పొందుతున్న కోర్సులు ఇంటిగ్రేటెడ్ కోర్సులు. ప్రస్తుతం ఇంటర్ తర్వాత విద్యార్థుల అభిరుచి మేరకు డిగ్రీ పూర్తి చేసి ఐసెట్, యూనివర్సిటీ సెట్‌ల ద్వారా పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారు. ఈ విద్యా విధానాన్ని కొనసాగిస్తూనే ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు ప్రవేశపరీక్షల ద్వారా సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్ కోర్సులలో పలు యూనివర్సిటీలు ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఆర్ట్స్, కామర్స్, సైన్స్ కోర్సులలో పీజీ పూర్తి చేసి అధ్యాపకులుగా స్థిరపడవచ్చు. అభిరుచి గల వారు పరిశోధనా రంగాన్ని ఎంచుకోవచ్చు.

### కామర్స్

ప్రస్తుతం గ్లోబలైజేషన్ ఫలితంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది కామర్స్ విద్యార్థులకు అవకాశాలు విస్తృతమవుతున్నాయి. ఎంబిఎ, ఎంకామ్‌లకు ప్రధాన అర్హత అయిన బికామ్ లాంటి డిగ్రీ స్థాయి కోర్సులతో పాటు సిఏ, ఐసిడబ్ల్యూఎ లాంటి ఇతర ఉన్నత స్థాయి ప్రొఫెషనల్ కోర్సులు వీరికి అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రొఫెషనల్ కోర్సుల వల్ల అతి తక్కువ సమయంలోనే జీవితంలో స్థిరపడవచ్చు. కనుక బికామ్ డిగ్రీతో పాటు CA, ICAI, CS ఓరియంటేషన్‌లో ప్రిపేరవడం మంచిది. కార్పొరేట్ రంగం విస్తరించడంతో మేనేజ్‌మెంట్ కోర్సులకు ఆదరణ పెరిగింది. ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు ఐసెట్ ద్వారా ఎంబిఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు కార్పొరేట్ కంపెనీలలో మంచి వేతనాలు పొందుతున్నారు. డిగ్రీ స్థాయిలో బ్యాచ్‌లర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌ను మన రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

### హ్యుమానిటీస్

హ్యుమానిటీస్ అంత బాగా పాపులర్ కానప్పటికీ, ఇంటర్మీడియట్ తర్వాత సాధారణ బిఎ డిగ్రీయే కాకుండా ఇతర కోర్సులను కూడా ఈ విభాగంలో అందిస్తున్నారు. వీటికి క్రేజ్ పెంచేందుకు జర్నలిజం, టూరిజం సబ్జక్టులను వీటిలో పొందుపరుస్తున్నారు. నదులన్నీ సముద్రాల్లో కలుస్తాయి అన్నట్టుగా డిగ్రీ పూర్తి చేసి సివిల్స్ సర్వీసెస్, గ్రూప్-1, 2, ఇతర పోటీ పరీక్షల ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే హిస్టరీ,పాలిటి, ఎకానమి వంటి సబ్జక్టులపై పట్టు సాధించాల్సిందే. అందుచేత ఈ కోర్సులవైపు ఆసక్తి గల అభ్యర్థులు నిరాశ చెందక తమ కరిక్యులమ్‌తోపాటు కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీపై దృష్టి సారిస్తే డిగ్రీ పూర్తి చేసిన తర్వాత స్వల్ప వ్యవధిలోనే ప్రభుత్వ ఉద్యోగం సంపాదించవచ్చు. పైమూడు విభాగాల్లో ఎంపిక చేసిన కాలేజీల్లో డిగ్రీ స్థాయిలో జాబ్ ఓరియంటెడ్ వొకేషనల్ సబ్జెక్టులను అంది స్తున్నాయి. ట్రావెల్ అండ్ టూరిజమ్, టీచింగ్, అడ్వర్టైజింగ్, జర్నలిజం, ఫెర్మామింగ్ ఆర్ట్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లాంటి పలు ఇతర కోర్సులను చేయవచ్చు.

### ఫైన్ ఆర్ట్స్

పెయింటింగ్, సంగీతం, వాస్తుకళ, డ్రామా, డాన్స్ మొదలైన కళలను ఫైన్ ఆర్ట్స్ అంటారు. ప్రాచీన కాలం నుండి ఈ కళలు సమాజంతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నాయి. సృజనాత్మకతతో కూడుకున్న ఈ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులలో నైపుణ్యం ప్రదర్శించిన సినిమా, మీడియా, యాడ్స్, డ్రామా, ప్రొడక్షన్ విభాగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ కోర్సులను మన రాష్ట్రంలో జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పద్మావతిమహిళా యూనివర్సిటీ మొదలైన సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

### పారా మెడికల్ కోర్సులు

బ్లడ్ రిపోర్టులు, ఎక్స్ రేలు తీయడం వంటి సేవల ద్వారా వైద్యరంగంలో డాక్టర్‌కు సహకరించేది పారా మెడికల్ స్టాఫ్. పారామెడికల్ బోర్డ్ ఈ కోర్సులను పర్యవేక్షిస్తోంది.

### ఇంటర్మీడియట్ తర్వాత పారామెడికల్ కోర్సులు

1. ఫిజియాలజీ
2. నర్సింగ్
3. మెడికల్ లాబ్ టెక్నిషియన్
4. ఆప్టోమెట్రి
5. ఆక్యుపేషనల్ థెరపీ
6. స్పీచ్ థెరపీ
7. డయాలసిస్ టెక్నిషియన్
8. ఆప్థాల్మాక్ అసిస్టెంట్
9. రేడియో థెరపీ టెక్నిషియన్
10. బ్లడ్ బ్యాంకింగ్ టెక్నిషియన్
11. రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్
12. డార్క్ రూమ్ అసిస్టెంట్
13. కార్డియాలజీ టెక్నిషియన్
14. కాథ్ లాబ్ టెక్నిషియన్
15. ఇసిజి టెక్నిషియన్
16. రెస్పిరేటరీ థెరపీ
17. మెడికల్ ఇమేజింగ్
18. ఎంపిహెచ్‌డబ్లూ (ఫీమేల్ ట్రైనింగ్ కోర్సు)
19. అనస్థీషియా టెక్నిషియన్
20. డెంటల్ హైజినిస్ట్ అండ్ టెక్నిషియన్
21. ఆడియోమెట్రిక్ ట్రైనింగ్
22. థియేటర్ టెక్నిషియన్
23. హాస్పిటల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్
24. కార్డియాలజీ పర్ఫ్యూజన్ టెక్నిషియన్

### ఒకేషనల్, సర్టిఫికెట్ కోర్సులు...

1. కాల్‌సెంటర్ అసిస్టెంట్
2. డిజిటల్ ఫోటోగ్రాఫర్
3. ఈవెంట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్
4. ఫ్యాషన్ టెక్నాలజీ
5. ఫ్లోరికల్చర్, లాండ్ స్కేపింగ్
6. ఫ్రంట్ ఆఫీసు అసిస్టెంట్
7. హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్
8. హౌస్ కీపింగ్
9. ఇన్సూరెన్స్ ఏజెంట్
10. లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్
11. మెకానిక్ కంప్యూటర్ హార్డ్‌వేర్
12. మెడికల్ లాబోరేటరీ టెక్నిషియన్
13. నెట్‌వర్క్ టెక్నిషియన్
14. ఫిజియోథెరపీ టెక్నిషియన్ (రేడియో డయాగ్నిసిస్)
15. టూరిస్ట్ గైడ్
16. డెస్క్ టాప్ పబ్లిషింగ్ ఆపరేటర్
17. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్
18. స్టెనోగ్రఫీ (ఇంగ్లీషు)
19. సెక్రటేరియల్ ప్రాక్టీస్
20. పైలెట్ లైసెన్స్
21. జెమాలజీ

### కోర్సుల ఎంపికలో జాగ్రత్తలు

కోర్సుల ఎంపికలో అభ్యర్థులు ముఖ్యంగా మూడు విషయాల పట్ల శ్రద్ధ వహించాలి. అవి

1) **అభిరుచి :-** అభ్యర్థి కోర్సు ఎంపికలో తన అభిరుచికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

2) **అవకాశాలు : -** అభ్యర్థి ఎంపిక చేసుకునే కోర్సుకు గల ప్రస్తుత, భవిష్యత్ అవకాశాలను అంచనా వేయాలి.

3) **ఆర్థిక స్థితి :-** చివరిగా అభ్యర్థి ఆర్థిక స్థితిని కూడా దృష్టిలో ఉంచుకొని కోర్సును ఎంపిక చేసుకోవాలి. ప్రభుత్వ రియంబర్స్‌మెంట్, బ్యాంకు రుణాల ద్వారా చాలా వరకు అభ్యర్థులు ఆర్థిక అడ్డంకులను అధిగమించవచ్చు.

**విద్యార్థులు తమ అభిరుచిని బట్టి సరైన కోర్సును ఎంపిక చేసుకొని అంకితభావంతో కృషి చేస్తే బంగారు భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు.**



- డా॥ వి. సతీష్